ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 17 ఏప్రిల్ , 2026 | పేజీలు : 06

## అడవిలో నిరుపయోగంగా నీటి కుంటలు...

### నీరు లేక వన్యప్రాణులు ఇక్కట్లు



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామ అటవీ ప్రాంతంలో వేసవి కాలం వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుంటలు నీరు లేక వట్టిపోయి నిరుపయోగంగా మారాయి. నీటి కుంటలలో నీరు లేకపోవడంతో ఎండలో వన్యప్రాణులు నీరు లేక ఇక్కట్లు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఎండా కాలంలో అటవి ప్రాంతంలోని నీటి కుంటలలో ఫారెస్ట్ అధికారులు నీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కానీ అక్కడ ఉన్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దస్ృనాయక్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా మీరు ఫోటోలు ఎలా తీస్తారని బెదిరింపులకు గురిచేస్తున్న పరిస్థితి. తక్షణమే అధికారుల స్పందించి వన్య ప్రాణులకు కోసం ఏర్పాటు చేసి నీటి కుంటలలో నీరు ఉండేలా ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# సంక్షేమ పథకాల అమలు వేగవంతం

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నాంపల్లి :** ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గురువారం నాంపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ శర్మ అధ్యక్షతన జరిగిన మండల సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సత్యం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయనకు అధికారులు,స్థానిక నాయకులు శాలువాతో సన్మానం చేసి,పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,సీటుబెల్ట్ ధరించాలని సూచించారు.పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రైతు బీమా తరహాలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.కొత్త పెన్షన్ దరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారికి అందించాలని,గ్రామాల్లో ఉన్న అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.సాదాబైనమా భూములకు సంబంధించి అఫిడవిట్ నిబంధనను ప్రభుత్వం ఎత్తివేసిందని,తహాసీల్దార్లు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు పట్టాలు ఇవ్వాలని సూచించారు.వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ గూగులోతు దేవాసింగ్,ప్రత్యేక అధికారి దేవరాజు, ఎస్ఐ కే లింగారెడ్డి,వివిధ శాఖల అధికారులు,గ్రామా సర్పంచులు,కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు

### కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/మునగాల:** ప్రజల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మునగాల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల సభలో జిల్లా ఎస్పి కె.నర్సింహాతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ప్రజా సమస్యలను అధికారులు గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామ సభలలో ప్రజా సమస్యలపై అందరూ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమం అందరికి చేరడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పేద విద్యార్థులు సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.200 కోట్లతో యాంగ్ ఇండియా స్కూళ్లను నిర్మిస్తుందన్నా రు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్ వివరించారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.శీరిష, తహసిల్దార్ సరిత, ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్, సర్పంచ్ నల్లపాటి ప్రమీల, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.



# అప్పు తీర్చినా వేధింపులు

### న్యాయం చేయాలని మహిళ వేడుకలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అప్పుగా తీసుకున్న డబ్బును వడ్డీతో సహా చెల్లించినప్పటికీ కొందరు వ్యక్తులు తనను ఇంకా వేధిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ అధికారులను ఆశ్రయించింది. వివర్లాలోకి వెళితే మండలపరిధిలోని పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కందుల కృష్ణవేణి (భర్త సైదులు) అనే మహిళ తన కుటుంబ అవసరాల కోసం ఇల్లు కట్టుకోవడం కోసం గతంలో వివిధ మార్గాల్లో అప్పులు తీసుకున్నారు. అందులో భాగంగా 2022 ఫిబ్రవరి 7న స్త్రీనిధి ద్వారా లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. దీంతో పాటు మరో లక్ష రూపాయలు తీసుకున్నారు. ఈ అప్పులకు సంబంధించి ఆమె నెలకు రూ.14వేలు చొప్పున వాయిదాలను చెల్లిస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకూ ఆమె తన అప్పు మొత్తాన్ని కందుల వెంకన్న, కందుల శ్రీను అనే వ్యక్తులకు చెల్లించినట్లు లేఖలో పేర్కొన్నారు. తాను కట్టాల్సిన డబ్బులు మొత్తం చెల్లించినప్పటికీ సదరు వ్యక్తులు నువ్వు ఇంకా డబ్బులు కట్టలేదు అంటూ ఆమె ఇంటి వద్దకు వచ్చి గొడవ చేస్తున్నారని తనను తీవ్రంగా వేధిస్తున్నారని కృష్ణవేణి వాపోయారు. తాను చెల్లించిన డబ్బులకు సంబంధించిన లెక్కలను సరిచూసి తప్పుడు అరోపణలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఉన్నతాధికారులను కోరారు. తనకు రావాల్సిన డబ్బుల విషయంలో సదరు వ్యక్తులు దౌర్జన్యం చేస్తున్నారని, తనకు ప్రాణహాని కలగకుండా రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆమె తన లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని వినతి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రంలోని మోత్కూర్ భువనగిరి ప్రధాన రహదారి నుంచి హైస్కూల్ వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు వెంట ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, రోడ్డుకు దూరంగా ఇరువైపులా నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని మండలవిద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ఏఈ ప్రవీణ్‌కు స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ పాల్గొన్నారు.



## దేశ భవిష్యత్తు యువత చేతిలోనే

### ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** దేశ భవిష్యత్తు నేటి యువత చేతిలోనే ఉందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విష్ణుకాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విదేశీ విద్యకు సంబంధించిన ఐ డేర్ ఓవర్సీస్ కార్యాలయంను ఆయన ప్రజా ప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ హైదరాబాద్ పట్టణ ప్రాంతాలకు వెళ్ళి యువత ఇబ్బంది పడకుండా మారుమూల ప్రాంతమైన మండల కేంద్రంలో విద్యార్థుల కోసం ఈ సదుపాయాన్ని కల్పించడం అభినందనీయం అని అన్నారు. ఇటలీ దేశానికి సంబంధించిన ఫ్రీ ఎడ్యూకేషన్‌తో పాటు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, యూరప్, సైప్రస్ వంటి దేశాలలో కూడా విద్యార్థులకు విద్యా సదుపాయాలను కల్పిస్తున్నందుకు మేనేజర్ రమావత్ చరణ్‌రాథోడ్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, మేనేజర్ రమావత్ చరణ్ రాథోడ్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కొండమల్లేపల్లి స్పెషల్ ఆఫీసర్ విజేందర్‌రెడ్డి సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల సభలో ఆయన వివిధ శాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు గ్రామాల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని అన్నారు. పథకాలపై అవగాహన కల్పించి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు.

## హైమాస్ట్ లైట్ల పునరుద్ధరణ

**ప్రజాపక్షం/డిండి;** శ్రీశైలం హైదరాబాద్ నేషనల్‌హైవేపై డిండి గ్రామాంలో గత కొన్ని సంవత్సరాలుగా వెలగకుండా ఉన్న హై మాస్ట్ లైట్లను హైవే అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడిన గ్రామ సర్పంచ్ నల్లగంతుల రవి గురువారం బాగు చేయించారు. పగటి పూట కరెంట్ వృథా కాకుండా ఉండేందుకు సాయంత్రం ఆటోమెటిక్‌గా వెలిగి ఉదయానికి ఆగిపోయేలా వీటిని సిద్ధం చేయించారు. హైవేపై డ్యామేజ్ అయిన మోరీల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే వాటి మరమ్మతులు పూర్తి చేస్తామని వారు హామీ ఇవ్వడం జరిగిందని డిండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి ప్రజలు, పాలనవర్గం సహకరించాలని కోరారు.





# వేం నరేందర్ రెడ్డికి బీర్ల అయిలయ్య శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/యాదాద్రి** : రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో, నరేందర్ రెడ్డికి అయిలయ్య పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పార్లమెంట్ వేదికగా ప్రజా గొంతుకను వినిపించేందుకు రాజ్యసభ సభ్యులుగా నియామకమైన వేం నరేందర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో వారు ప్రజాసేవలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసం శక్తివంచన లేకుండా కృషి చేసి విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కానుగు బాలరాజు తదితరులు ఉన్నారు.

# జాప్యం లేకుండా సర్టిఫికెట్లను జారీ చేయాలని వినతి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలు జాప్యం లేకుండా జారీ చేయాలని పలువురు సర్పంచులు తహశీల్దార్ రాజశేఖర్ రెడ్డిని కోరారు. గురువారం మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పెన్‌పహాడ్ సర్పంచ్ ఒగ్గు రవి, గాజులమల్కాపురం సర్పంచ్ నాతాల వెంకట్‌రెడ్డి, సింగిరెడ్డిపాలెం సర్పంచ్ ఒగ్గు కిరణ్, తంగెళ్ళగూడెం సర్పంచ్ పందుల వెంకటేశ్వర్లు, నాగులపహాడ్ సర్పంచ్ నిరంజన్ రెడ్డి ఉన్నారు.

# కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/అర్వపల్లి** : మండల కేంద్రంలోని పీఎంశ్రీ జడ్‌పి హైస్కూల్ అర్వపల్లి ప్రాంగణంలో బిగ్‌హెల్ప్ సంస్థ ఆర్థిక సహాయంతో మే 1వ తేదీ నుంచి జూన్ 2 వరకు నెల రోజుల పాటు జరిగే కుట్టు శిక్షణ కార్యక్రమానికి పాఠశాల విద్యార్థినీలతోపాటు మండల పరిధిలోని ఆవాస గ్రామాల్లో చదువు మానేసిన యువతులు, నిరుపేద ఒంటరి మహిళలు ఈనెల 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, బిగ్ హెల్ప్ సంస్థ సెక్రటరీ మల్లేష్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9848845220ను సంప్రదించాలని కోరారు.

# నేడు నిరసన

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొనే ప్రధాన డిమాండ్ల పరిష్కారానికై టిజిఇజెఎసి సూర్యాపేట జిల్లా ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిజిఇజెఎసి సూర్యాపేట జిల్లా చైర్మన్ ఎస్‌కె జానీమియా, డిప్యూటి జనరల్ సెక్రటరీ తంగెళ్ల జితేందర్ రెడ్డిలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో నిరసన కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నిరసన కార్యక్రమానికి ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్. సోమయ్య, పుప్పాల వీరన్న, పబ్బతి వెంకటేశ్వర్లు, పాండు నాయక్, రవికుమార్ పాల్గొన్నారు.



# నియోజకవర్గ డిమాండ్‌కు చారిత్రక ఆధారాలతో వినతి

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలానికి ఉన్న చారిత్రక, పరిపాలన ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని, కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డిలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా నడిగూడెం ప్రాంతాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలని కోరుతూ గురువారం తహసిల్దార్‌కు సూరయ్యకు, ఎంపిడివో మల్సూర్‌నాయక్ లకు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరపతమ్మ సుధీర్ లు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నడిగూడెం నియోజకవర్గ సాధన ఉద్యమ కమిటి చైర్మన్ బెల్లంకొండ నవీన్ మాట్లాడుతూ నడిగూడెం ప్రాంతం 19వ శతాబ్దం చివరి నుండి 20వ శతాబ్దం ప్రారంభం వరకు నాయని వంశానికి చెందిన రాజా నాయని వెంకట రంగారావు పాలనలో ఒక ప్రధాన పరిపాలన కేంద్రంగా వెలుగొందిందని ఆ కాలంలో



నిర్మించబడిన నడిగూడెం కోట ప్రాంతీయ పరిపాలన, న్యాయ వ్యవస్థ, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్ర బింధువుగా నిలిచిందన్నారు. నడిగూడెం మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు బోనగిరి ఉపేందర్, పందిటి నవీన్‌కుమార్, రైతు సంఘం నాయకులు ఏనుగుల వీరాంజనేయులు, చల్లా సతీష్, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# ‘హలో మెడికో పేరెంట్స్ - చలో వరంగల్’ పిలుపు

**మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పానుగుళ్ళ సుజాత పిలుపు**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ , ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో కొనసాగుతున్న విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.ఈమేరకు ఏప్రిల్ 17న వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వద్ద హలో మెడికో పేరెంట్స్ చలో వరంగల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పానుగుళ్ళ సుజాత తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఅండ్‌సి కేటగిరీలలో చదువుతున్న విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సాధారణంగా 4.5 సంవత్సరాలకు తీసుకోవాల్సిన ఫీజును 5 సంవత్సరాలకు వసూలు చేస్తూ లక్షల రూపాయలు అదనంగా భారంగా మోపుతున్నారని అన్నారు. అలాగే హాస్టల్ ఫీజులు కూడా లక్షల్లో వసూలు చేస్తూ, కనీస వసతులు కల్పించకపోవడం బాధాకరమని తెలిపారు.ప్రత్యేకంగా అమ్మాయిల హాస్టళ్లలో శుభ్రత లేకపోవడం, భద్రతా సమస్యలు తీవ్రంగా ఉన్నాయని,దీనివల్ల విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ అన్ని సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 17న విశ్వవిద్యాలయాన్ని ముట్టడించనున్నామని, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మెడికో పేరెంట్స్ అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పానుగుళ్ళ సుజాత పిలుపునిచ్చారు.

# బీర్ల అయిలయ్య సవాల్‌ను స్వాగతిస్తున్నాం

**ప్రజాపక్షం/రాజపేట** : రాజాపేట మండలం చల్లూరు గ్రామంలోని 322 సర్వే నెంబర్ క్రషర్ వ్యవహారంలో చర్చకు సిద్ధమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేసిన సవాల్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి స్వాగతించారు. గురువారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. వివాదాస్పదంగా మారిన సదరు క్రషర్ వద్దే ఈ బహిరంగ చర్చ నిర్వహిద్దామని, ఎమ్మెల్యే బిజీ షెడ్యూల్ దృష్ట్యా మీరు తేదీని ఖరారు చేస్తే తాము రావడానికి సిద్ధమని ప్రకటించారు. జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నేతలు, జర్నలిస్టుల సాక్షిగా ఈ చర్చ జరగాలని డిమాండ్ చేశారు. చల్లూరులో రాత్రింబగళ్లు అక్రమంగా బ్లాస్టింగ్లు జరుగుతున్నా ఎందుకు మౌనంగా ఉన్నారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు.



అక్రమాలను ప్రశ్నిస్తే సోషల్ మీడియా పేరుతో కేసులు పెడతామని బెదిరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, తక్షణమే సదరు క్రషర్ కార్యకలాపాలను నిలిపివేయించి విచారణ జరిపించడం ద్వారా ఎమ్మెల్యే తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

# కలెక్టర్ ముందు పురుగుల మందు తాగిన మహిళ

**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రంలో గురువారం ప్రజా పాలన సభ జరుగుతున్న సమయంలో తాడ్వాయి గ్రామానికి చెందిన కోట సునిత ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సమక్షంలో ఆమె పురుగుల మందుతాగి ఆత్మహత్యానికి పాల్పడింది. ఆమెను వెంటనే కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతుంది. దీంతో సిపిఐ(ఎం) నాయకుడు ముల్కలపల్లి రాములు ఆమెను పరామర్శించి అనంతరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడటంతో ఆమెకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కోట సునితను పరామర్శించిన వారిలో సిపిఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎం,ముత్యాలు, సొంపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, ఆమె బంధువులు ఉన్నారు.

# పోషకాహారం ప్రాముఖ్యత

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మనం తీసుకునే ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరు ధాన్యాలకు ఎక్కువ స్థాయి ప్రముఖ్యతను ఇవ్వాలని కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి అన్నారు. గురువారం మండల పరిధిలోని గడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పెరటి తోటల పెంపకం, మన ఇండ్లలో కూరగాయలను పెంచుకుని ఉపయోగించుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. మనకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు విటమిన్స్, మినరల్స్, కూరగాయలలో ఎక్కువగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ భాషీర, అనిత, గర్భిణీలు, చిన్న పిల్లలు, బాలింతలు పాల్గొన్నారు.





# 20 నుంచి సిపిఐ ఇంటింటి ప్రచారం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** ఈనెల 20 నుంచి సిపిఐ జిల్లా స్థాయి నాయకులు అదేశానుసారం మేళ్లచెరువు మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని ఘనంగా నిర్వహించాలని సిపిఐ మండల కార్యదర్శి గొంగిరెడ్డి భద్రారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో సిపిఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 నుంచి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. సిపిఐ జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను సేకరించి వాటి పరిష్కారం కోసం పోరాటం చేయడం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు సోమగాని మల్లయ్య, చిదిరాల యలమంద, తుమ్మ శంకరయ్య, సారెడ్డి పాపిరెడ్డి, కందిబండ వెంకటేశ్వర్లు, ఆళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# గోవులను జాతీయ జంతువుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలని అడ్డగూడూరు మండలకేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో అన్ని రాష్ట్రాల శాసనసభల్లో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఐదు జిల్లాల ప్రభారి కిషన్ రెడ్డి ప్రజ చైతన్య యాత్ర చేపట్టారు. ఏప్రిల్ 27న ఉదయం 11 గంటలకు గోమాత అభిమానులు కులాలకు సంఘాలకు పార్టీలకు అతీతంగా పెద్దసంఖ్యలో పాల్గొని అడ్డగూడూరు తాహాశీల్దార్‌కి పై విషయం పై వినతి పత్రం ఇవ్వాలి ఇందుకోసం అన్ని గ్రామాలలో సంతకాలు సేకరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోట మురళి, ఆర్‌యస్‌యస్ బౌద్ధిక్ ప్రముఖ్, కూరాకుల వెంకన్న బిజెపి అసంబ్లీ కోకన్వీనర్, నసుబోతు సమ్మయ్య, గొడిశాల రాజు జానకిపురం సర్పంచ్, ఉపసర్పంచ్ బొమ్మగాని లక్ష్మయ్య పాల్గొన్నారు.

# స్టేట్ ఎలిజబులిటీ టెస్ట్‌లో అర్హత సాధించిన తెలుగు శాఖ విద్యార్థులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఎంజియు తెలుగు శాఖకు చెందిన విద్యార్థులు ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన స్టేట్ ఎలిజబులిటీ టెస్ట్‌లో అర్హత సాధించారు.గురువారం డి.మల్లేష్,జి రమ్య,వి.శ్రీను తలారి సతీష్‌లను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్,విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కే అరుణ ప్రియ అభినందించారు. అదేవిధంగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పక్షాన దక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ ఫొజిల్స్,ద్రావిడ విశ్వవిద్యాలయం,కుప్పం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు ప్రాంతాలలో జానపద ఆరాధన,మౌఖిక సంప్రదాయాలు దేశి జ్ఞాన వ్యవస్థల అంతస్సంబంధాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఎంఎ తెలుగు విద్యార్థులు సిహెచ్ శివకుమార్,జి త్రివేణి,నందు ప్రసాద్, కావేరి,మంద స్నేహిత, ధరంశోత్ లలిత,ఎనుముల ప్రశాంతులు పాల్గొని తమ పత్ర సమర్పణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ మ్యాతరి ఆనంద్,డాక్టర్ మద్దిరాల సత్యనారాయణ రెడ్డి,డాక్టర్ సి.అనిత కుమారి,అనిల్ కుమార్ పాల్గొన్నారు.





## ముత్తమ్మ మృతి బాధాకరం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మారుతి ముత్తమ్మ మృతి చాల బాధకరమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని కరివిరాల గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి మారుతి ఉపేందర్ మాతృమూర్తి ముత్తమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరమార్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారోజు పార్వతమ్మ, ఉప సర్పంచ్ రెణబోతు కృష్ణారెడ్డి, నాయకులు అనంతుల అంజనేయులు, కురాకుల కృష్ణమూర్తి, నలమాద నారాయణరావు, పోటు ప్రసాద్, షేక్ జలీల్, గురుమూర్తి, జానిపాషా, శోభ, పుల్లయ్య, రవి, కమల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని రత్నవరం గ్రామంలో స్వర్ణభారతి చారిట్రబుల్ ట్రస్టు కోదాడ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత కంటి పరీక్షలు, శస్త్ర చికిత్స శిబిరంను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి కంటిని పరీక్షించి వారిలో 30 మందికి కేటరాక్ట్ ఆపరేషన్ కోసం లయన్స్ కంటి ఆసుపత్రి సూర్యాపేటకు సిపారస్ చేశారు. స్వర్ణభారతి చారిట్రబుల్ ట్రస్టు వారిని గ్రామ సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజు మణికుమార్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, పెద్దలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వల్లంభట్ల రమాదేవి పూర్ణచందర్ రావు కోరారు. గురువారం మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులకు ధాన్యం అమ్మకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కంబాల వీరయ్య, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పిఏసిఎస్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ సమస్య... జర పట్టించుకోండి సారూ...



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండల పరిధిలోని లింగగిరి గ్రామంలోని 4వ వార్డులోని మెయిన్ బజార్‌లో గత మూడు నెలల నుంచి పైపులైన్ లీకేజీ నీరంతా రోడ్డుమీద పారుతున్నాయని, ఆ రోడ్డు అపరిశుభ్రంగా ఉండటంతో నీరు కలుషితమై ఇంటిలోకి వచ్చే పైపులైన్‌కు నీరు కలుషితమై అనారోగ్య సమస్య లేత్తే ప్రమాదం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. వార్డు ప్రజలు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవకవర్గా లకు పైపులైన్ సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు చెప్పినా ఎటువంటి స్పందన లభించలేదని ప్రజలు వాపోతున్నారు. స్వయంగా సర్పంచ్ వచ్చి పైపులైన్ సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చినా ఎటువంటి ఫలితం లభించలేదని ఆ వార్డు ప్రజలు వాపోతున్నారు. 4వ వార్డు సభ్యులు నాగయ్య గ్రామ సభలో, జనరల్ బాడీ సమావేశంలో చెప్పిన పట్టించుకోలేదన్నారు. సంబంధిత అధికారులు, సర్పంచ్ జోక్యం చేసుకుని పైపులైన్ లీకేజికి అడ్డుకట్ట వేయాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

## బిసి మహిళల వాటా తేలే వరకు మహిళా బిల్లును వ్యతిరేకించాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళల వాటా తేలే వరకు పార్టీలకు అతీతంగా ఓబీసీ ఎంపీలందరు మహిళా బిల్లును వ్యతిరేకించాలని బీసీ జేఏపీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. బీసీ మహిళలకు సబ్ కోటా ఉండాలని గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో అగ్రకులాల మహిళలకే లాభం చేకూరుతుందన్నారు. అగ్రకులాకుల మరో వంద సంవత్సరాలు రాజ్యాధికారం కట్టబెట్టడానికే మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకొస్తున్నారని ఇప్పటికే పార్లమెంట్, అసెంబ్లీలో మెజార్టీగా ఉన్న ఓబీసీలకు ప్రాతినిధ్యం లేక రాజకీయంగా వెనుకబడి పోతుంటే తెరమీదకు మహిళా బిల్లు పేరుతో మళ్లీ అగ్రకులాలకు చెందిన మహిళలే చట్టసభలకు వెళ్తారని బీసీ మహిళలు రాజకీయ అణచివేతకు గురవుతారని అన్నారు.

## గ్రామాల అభివృద్ధికి నిధులను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి నిధులను విడుదల చేయాలని బిఆర్‌ఎస్ సర్పంచులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన గ్రామసభలకు టెంట్లు, కుర్చీల ఖర్చుతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. ఈ ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు చేసుకుంటున్న దరఖాస్తులకు పరిష్కారం లేక గ్రామ పంచాయితీ కార్యాలయంలో పేరుకుపోతున్నాయని విమర్శించారు. తక్షణమే ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు వల్లపు గంగయ్య, కర్నాటి వెంకన్న, బొడ్డు ఇందిరా సోమరాజు, మేడి వీరస్వామి, అంకిరెడ్డి వీరాంజనేయులు, బానోతు సైదులు, నున్న యాదగిరి, కేలోతు కాంతమ్మ హరిలాల్, కలకోట్ల శైలేందర్ పాల్గొన్నారు.

## ప్రజా ప్రణాళికలో 40 రోజుల్లో సాధించింది ఏమిటి?

### మాజీ ఎమ్మెల్యే లింగయ్య విమర్శ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో గడిచిన 40 రోజులలో సాధించిన ప్రగతి శూన్యమని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. గురువారం స్థానిక సువర్ణ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు గ్రామాలలో,మండల కేంద్రాలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయకుండా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ప్రగతి ప్రణాళిక అంటూ గ్రామాలలో పారిశుద్ధం, మురికి కాలువలు శుభ్రం చేసి పింఛన్లు,రేషన్ కార్డులు తదితర అంశాలపై చర్చించడమేనా ప్రగతి అని విమర్శించారు. ధాన్యం కేంద్రాలలో తాలు పేరుతో క్వింటాలుకు సుమారు 12 కిలోల ధాన్యం అధికంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో బిఆర్‌ఎస్ సర్పంచులకు కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్,బిఆర్‌ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు ప్రగడపు నవీన్ రావు, మారం వెంకట్ రెడ్డి,నాయకులు గుండగోని జంగయ్య గౌడ్ పాల్గొన్నారు.

## టిడిపి జాతీయ కమిటీలో తెలంగాణ నేతలకు ప్రాధాన్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు ప్రకటించిన టీడీపీ జాతీయ కమిటీలో తెలంగాణ శాఖకు పెద్దపీట వేయడం పట్ల టీడీపీ నాయకుడు పోగుల సైదులుగౌడ్ గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలిట్ బ్యూరో సభ్యులుగా స్థానం సంపాదించుకున్న బక్కని నరసింహులుకు, అరవింద్‌కుమార్‌గౌడ్‌కు, నర్సిరెడ్డికి, తిరునగరి జ్యోత్స్నలకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే కాలంలో తెలంగాణాలో టీడీపీ అధికారంలోకి వస్తుందన్నారు. అధినాయకత్వం ఇచ్చిన ఉత్సాహంతో రెట్టింపు కష్టంతో తెలంగాణాలో పసుపు జెండా రెపరెపలాడే వరకు టీడీపీ కార్యకర్తలు కృషి చేస్తారన్నారు.





## కల్లూరులో రైతు సంఘం 2వ మహాసభ

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం రైతు సంఘం 2వ మహాసభను వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు మాట్లాడుతూ రైతు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో స్వామినాధన్ కమిషన్ సిపారస్ అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. పరిశ్రమలో తయారు చేసిన వస్తువులకు యాజమాన్యం ధర నిర్ణయిస్తే రైతు పండించిన పంటకు రైతు భరోసా ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పాతూరి శ్రీనివాసరావు, కట్ట మధుబాబు, బొప్పని రాణమ్మ, అల్వాల శ్రీధర్, బుడిగ ధనుంజయ, చలసాని అప్పారావు, సిరికొండ సత్యం, సైదులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నిర్మూలన బాధ్యత



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** నిక్షయ్ శిబిర్ ప్రచారం అనేది భారతదేశాన్ని క్షయ రహిత దేశంగా మార్చే లక్ష్యం వేగవంతం చేయటానికి నిర్వహించే 100 రోజుల కార్యక్రమమని గరిడేపల్లి సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి నివారణ శిబిరంను ప్రారంభించారు. డాక్టర్ నరేష్ మాట్లాడుతూ నిక్షయ్ శిబిర్ ప్రచారం భారతదేశాన్ని క్షయ రహిత దేశంగా మార్చే లక్ష్యం వేగవంతం చేయడానికి నిర్వహించే 100 రోజుల కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సామూహికంగా క్షయ నిర్ధారణ కోసం స్పూటం పరీక్షలు, ఎక్స్‌రే పరీక్ష సైట్ టివి ఇంజక్షన్ ద్వారా వ్యక్తికి బ్యాక్టరీయా ఉన్నదా లేదానిర్ధారించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, డాక్టర్ సంతోష్ సుష్మా, అశోక్, తీగల నర్సింహా, అంజయ్యగౌడ్, వెంకటరమణ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని సూపర్‌వైజర్ సీహెచ్.పద్మ అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక బంగారుగడ్డలోని అంగన్‌వాడి కేంద్రంలో ఈసీసీఈ దేను నిర్వహించగా ఆమె కౌన్సిలర్ రమేష్‌తో కలిసి మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు చిరుధాన్యాలు, మిల్లెట్స్, గుడ్లు, పాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. 3 6 సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడి కేంద్రాలకు పంపించినట్లయితే ప్రీస్కూల్ విద్యను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు రమాదేవి, మీనాక్షి, విజయ, మేరాజ్ సుల్తానా, షామిన్, మల్లేశ్వరి, ఆయా నాగలక్ష్మి , ఏఎన్‌ఎం శోభారాణి, ఆశా అమృతలక్ష్మి , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందిన గంగుల శశికళ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులకు రూ.10000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగుల వెంకటరెడ్డి, వార్డు మెంబర్స్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## 9వ రోజుకు చేరిన ఆర్టిజన్, పీస్ రేట్ కార్మికుల సమ్మె

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ విద్యుత్ డివిజన్ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ ఆర్టిజన్, పీస్ రేట్ కార్మికుల నిరవధిక సమ్మె గురువారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల టీవీఏఈ జేఏసీ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించగా మిర్యాలగూడ జేఏసీ కార్యదర్శి నర్సింగ్ రాము, అధ్యక్షుడు నెమలి ఆదిరెడ్డిలు మాట్లాడుతూ విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. విద్యుత్ సంస్థల్లో అన్ని రకాల అర్హతలు కలిగి ఉండి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని సంస్థలో విలీనం చేయాలని అన్నారు. కార్యక్రమంలో బైరం అశోక్, వల్లంపట్ల మధు, గాలిబ్ సాబ్, ఆనంద్, లలిత, సరిత, నరేందర్‌రెడ్డి, షఫిఖాన్, రాజేశ్వర్‌రావు, ఆంజనేయులు, సైదులు, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి




**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి, గోవధ నిషేధించాలని గోమాత గౌరవ ప్రచార యాత్ర నిర్వాహకులు బూనేటి కిషన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆవును జాతీయ జంతువు ప్రకటించాలని, ప్రతి సంవత్సరం గో గౌరవ దినోత్సవాన్ని నిర్వహించి జాతీయస్థాయిలో గౌరవ ఇవ్వాలని పిలుపునిచ్చారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 27న మండలంలోని అన్ని తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, మోదుగుంట సర్పంచ్ సోలిపురం ఎల్లారెడ్డి, బండారి గోపాల్ సోమిరెడ్డి బండారు సాయి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం శివా రెడ్డిగూడెం గ్రామానికి చెందిన వారాల రేవంత్ రెడ్డి 50 మంది కార్యకర్తలతో కలిసి గురువారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకొని శుభాకాంక్షలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నర్సింహారెడ్డి సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, ఉప సర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్, వారాల రామచంద్రారెడ్డి నారి మహేష్, చినుకుల శివకుమార్, సరసాని కృష్ణవేణి, వారాల కరుణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకే.. ప్రజాపాలన లక్ష్యం

**ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన వ్యక్తికి చేరేలా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల ముఖ్య ఉద్దేశ్యమని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.గురువారం పట్టణంలోని సత్యసాయి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మండల స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. నకిరేకల్‌లో రూ.200 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.గత పాలనలో రాష్ట్రం భారీ అప్పుల బారిన పడిందని ఆరోపిస్తూ,ప్రస్తుతం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,మున్సిపాలిటీ చైర్మన్ చెవుగోని రజిత శ్రీనివాస్ గౌడ్,ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, తహసిల్దార్ యశ్వంత్ రాజ్,మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్,ఎంఈఓ మేక నాగయ్య,ఐసీడీఎస్ సీడీపీఓ ఆశ్ర అంజుమ్,ఏపీవో రమణయ్య,ఏపిఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

**కట్టంగూరు మండలంలో** : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక లో భాగముగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక భాగంగా గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి.సతీష్ కుమార్,ఎంపీడీవోపి.జ్ఞానప్రకాష్ రావు,తహశీల్దార్ పుష్పలత,ఎంఈఓ అంబటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ డ్రైవరూ... ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు




**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రతి డ్రైవర్ విధిగా ఆరు నెలలకు ఒకసారి కంటి చూపుకు సంబంధించిన పరీక్షలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భువనగిరి పోలీస్ శాఖ, భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్ (చావా ఫౌండేషన్) పర్ఫెక్ట్ కంటి హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం భువనగిరి పట్టణంలోని బస్టాండ్ ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నందు డాక్టర్ చావ రాజ్ కుమార్, ఆప్తమాలజిస్ట్ అరుణాదేవి పోలీస్ సిబ్బంది, బస్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, స్థానిక వర్కర్లకు బిపి షుగర్ కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సలహా మేరకు వారికీ అవసరమైన మందులు కంటి అద్దాలు కంటి, డ్రాప్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రావాణ శాఖ అధికారి సాయి కృష్ణ, భువనగిరి డిఎస్పీ బి. రవీందర్, ట్రాఫిక్ డిఎస్పీ ప్రభాకర్ రెడ్డి, భువనగిరి టౌన్ ఇన్స్పెక్టర్ ఎం రమేష్, భువనగిరి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మధు సూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/త్రిపురారం:** అగ్రకులమనే అక్కసుతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి కట్టించిన దిమ్మెను కులగోట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య,జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కామర్ల జానయ్య డిమాండ్ చేశారు.గురువారం అంబేద్కర్ అవమానపరచడానికి నిరసిస్తూ మండల కేంద్రంలో గల సాగర్ రోడ్డుపై ధర్నా చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయులైన డాక్టర్ బిఆర్ అంబేద్కర్,మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలు జడ్చర్ల రహదారి వెంట ఉండాలి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మహనీయుల విగ్రహాలను తొలగించడం జరిగింది.అయితే తిరిగి మహనీయుల విగ్రహాలను జడ్చర్ల రహదారుల వెంట ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్నందుకు జిల్లా కలెక్టర్‌కు విన్నపించగా అధికారుల ఆదేశానుసారం బాబుసాయి పేట ఎక్స్ రోడ్ సమీపంలో విగ్రహాలను ఏర్పాటు చేయడానికి దిమ్మెను నిర్మించడం జరిగింది.ఇట్టి దిమ్మెను మండల కేంద్రానికి చెందిన ఓవ్యక్తి ధ్వంసం చేయడం మహనీయులను అవమానించడమే కాకుండా వారి జాతులను కూడా అవమానపరచడమే ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు,మాల మహానాడు జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి సైదులు,బీసీ సంఘం నాయకులు నగిరి వెంకన్న,చింతకాయల యాదయ్య, చిత్ర నరేష్,అశోక్ రాము,కోటేష్,జలంధర్,లక్ష్మణ్, అంగరాజ్,గంగాధర్ పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా వాహనం నడపొద్దు




**ప్రజాపక్షం/కోదాడ:** లైసెన్స్ లేకుండా వాహనం నడపవద్దని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి అన్నారు. గురువారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రత పాటించాల్సిన నియమ నిబంధనలను తెలిపారు. విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే, వారి తల్లిదండ్రులకు జైలు శిక్ష పడుతుందని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, వాహనంపై నడిపే వారితో పాటు కూర్చున్న వారు కూడా హెల్మెంట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాలను కోల్పోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు డి.మార్కేండేయ, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామివారికి తిరుప్పావడ సేవ..



**ప్రజాపక్షం/భువనగిరి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను భక్తిశ్రద్ధలతో విశేషంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని భక్తులకు కల్పించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్ఛారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు.

## శంకర్ మాదిగకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే 'దళిత రత్న' అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ప్రధాన అనుచరుడు సోమారం శంకర్ మాదిగను గురువారం పోచంపల్లి మండల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్లోని రవీంద్రభారతిలో ఏప్రిల్ 14న జరిగిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో భాగంగా, దళిత అభ్యున్నతికి ఆయన చేసిన విశేష కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ నేపథ్యంలో పోచంపల్లికి విచ్చేసిన ఆయనకు స్థానిక నేతలు శాలువాలు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపీ రజక మాట్లాడుతూ సామాజిక సేవా రంగంలో చేస్తున్న పోరాటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, కొండమడుగు ఎల్లాస్వామి సర్పంచ్ పేరుమండ్ల మహాలక్ష్మి దానయ్య, మాజీ సర్పంచ్ యాకరి రేణుక నర్సింగరావు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** పార్టీలకు అతీతంగా ప్రభుత్వాలు అందించే పథకాలు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహాకారంతో అర్హులైన ప్రతి పేదవారికి అందజేస్తామని భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖా బాబురావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం భువనగిరిలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డీఎస్పీ రవీందర్, తహశీల్దార్ జగన్ మోహన్ ప్రసాద్, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ దినాకర్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** తిరుమలగిరి సాగర్ మండలంలో సాగర్ హైవేపై తిరిగే ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కాంపెయిన్‌లో భాగంగా చేపట్టిన ఆటో ట్రాఫిక్ నియమాలపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ వీరశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోలలో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని అధికారులు హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## వధూవరులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/చింతపల్లి** : మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామానిక చెందిన ఉప సర్పంచ్ జోగు మంజుల శ్రీరాములు దంపతుల కుమార్తె జోగు పూజ, పవన్‌ల వివాహం గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, సిపిఐ నాయకులు వింజమూరి నరసింహా, మల్లోజు శేఖరాచారి, కొనిదల వెంకటయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## బాలికలకు వైరస్ వ్యాక్సినేషన్

**ప్రజాపక్షం/అర్వపల్లి** ః మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ వ్యాక్సిన్ వేశారు. వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ మాట్లాడుతూ గార్డాసిల్ వ్యాక్సిన్ ప్రభుత్వము ఉచితముగా ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యాక్సిన్ చేయడం వల్ల ముందు జాగ్రత్తగా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ వ్యాక్సిన్ విలువైనది కావున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ ఆఫీసర్ బోడ సునీత, శ్యామల జ్యోతి పాల్గొన్నారు.

## ప్రజాప్రభుత్వంలో ప్రజా సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/చింతలపాలెం** ః ప్రజాప్రభుత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు మేలు చేస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు నరాల కొండారెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమావేశం స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగింది. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ తమ విభాగాలకు సంబంధించిన పథకాలు, అమలు విధానం, ప్రగతి వివరాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోషకాహారం కీలకం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** చిన్నపిల్లల అభివృద్ధికి సరైన పోషకాహారం కీలకమని జిల్లా సంక్షేమ అధికారి కె.వి.కృష్ణవేణి తెలిపారు.8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని చర్లపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 23 వరకు జరిగే ఈ కార్యక్రమంలో తల్లిశిశు పోషణ,ఆరోగ్య అవగాహనపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



## టివిఎఇ జెఎసి అర్ధనగ్న నిరసన ప్రదర్శన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొనసాగుతున్న నిరవధిక సమ్మె 9వ రోజుకు చేరింది.ఈసందర్భంగా కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని దీక్షను విజయవంతం చేశారు. ప్రభుత్వం,యాజమాన్యం కార్మికుల సమస్యలపై స్పందించకుండా వారిని టెర్మినేట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్న మొండి వైఖరిని కార్మికులు తీవ్రంగా ఖండించారు.8వ రోజు యాజమాన్యం జేఏసీతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి.ఈ పరిణామాల నేపథ్యంలో గోడ కొమ్మలు అనే కార్మికుడు తీవ్ర మనస్తాపానికి గురై గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. 9వ రోజు దీక్షలో భాగంగా 12 మంది కార్మికులు ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టడంతో పాటు అర్ధనగ్న నిరసన ప్రదర్శన నిర్వహించారు .ఈ కార్యక్రమంలో



జిల్లా అధ్యక్షుడు జిట్టబోయిన లింగస్వామి,జిల్లా నాయకులు లింగారెడ్డి,పెరుమాల్ల మురళి, విశ్వం, వేణుగోపాల్ రెడ్డి, బొప్పాని యాదయ్య,గణేష్, అద్దంకి వెంకన్న,పోతపాక విజయ్ కుమార్, కోటి, విజయ్ రెడ్డి, పరమేష్,ఉపేందర్,రమేష్, వెంకన్న, లచ్చిరెడ్డి,వెంకట్ రెడ్డి,నాగమణి, కరుణ, కళావతి, ఆరీఫా, భారతీ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే కార్మికులు అధిక సంఖ్యలో హాజరై సమ్మెకు సంఘీభావం తెలిపారు.

## సమస్యల సాధనకై 17న నల్ల బ్యాడ్జీలతో నిరసన



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎస్‌టియుటిఎస్ నాయకులు మండల శాఖ అధ్యక్షుడు అంబటి వీరనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌టియు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలోని ఉద్యోగులు,ఉపాధ్యాయులు,కార్మికులు,పెన్షనర్ల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.ఈనేపథ్యంలో ఏప్రిల్ 17న నల్ల బ్యాడ్జీలతో నిరసన నిర్వహించి మెమొరాండం సమర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..2వ పీఆర్‌సీని 51ఫిట్‌మెంట్‌తో జూన్ 2లోపు అమలు చేయడం,రూ.13,000 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల,ఉద్యోగులుపెన్షనర్లకు ఆరోగ్య కార్డుల అమలు,సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ ఉన్నాయి.ఈసమస్యలు పరిష్కారం కాకపోతే మే 5 తర్వాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి వలిశెట్టి విజయభాస్కర్, పూర్వ జిల్లా అధ్యక్షులు కొనకంచి వీరరాఘవులు,జిల్లా ఆర్థిక కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు, మండల ఆర్థిక కార్యదర్శి ఎం. నవీన్ కుమార్,జిల్లా సీనియర్ నాయకులు ఏ. తావూరియా, ఆర్. రాంసింగ్,ఆర్. లాలు, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎన్. సురేష్ కుమార్,త్రిపురారం మండల అధ్యక్షుడు కడారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వసంత్ పాటేల్ బాధ్యతలు స్వీకారం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వసంత్ పాటేల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.కొత్తగూడెం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు నల్లగొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వసంత్ పాటేల్‌ను పూల బొకేలు అందించి సత్కరించారు.ఇదే సందర్భంగా కే.కవిత అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించగా,ఆమెను కూడా ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా వసంత్ పాటేల్ మాట్లాడుతూ న్యాయవాదులతో సమన్వయం చేసుకుని కక్షిదారులకు త్వరిత న్యాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతులను పూర్తిచేయడంపై దృష్టి సారిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.సతీష్



కుమార్,ప్రధాన కార్యదర్శి బి.అశోక్ కుమార్,ఉపాధ్యక్షులు పజూరి స్వామి గౌడ్, నూకల సంధ్యారాణి,సహాయ కార్యదర్శి సూరేపల్లి అమరావతి,కోశాధికారి ఎండి ఫిరోజ్,గేమ్స్ సెక్రటరీ ఎన్. ప్రసన్నకుమార్,రామకృష్ణ, సభ్యులు గుర్రం వెంకటరెడ్డి,జెనిగల రాములు,పందుల సైదులు,కేఎన్‌కుమార్, నాంపల్లి భాగ్యమ్మ,ఎం.ప్రగతి, దువ గీతతో పాటు సీనియర్ న్యాయవాదులు కట్టా ఆనంత రెడ్డి, జి. జవహర్ లాల్, జీ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/మోటకొండూరు** : రైతులు వరి ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే అమ్మి మద్దత్తు ధర పొందాలని మోటకొండూర్ తహసిల్దార్ రాజేంద్రప్రసాద్, ఆబిద్నగర్ సర్పంచ్ నాయిని అమరావతి రామచంద్రారెడ్డిలు అన్నారు. గురువారం వారు నూతన గ్రామ పంచాయతీ ఆబిద్ నగర్‌లో ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు సహకార కోఆపరేటివ్ బ్యాంక్ వెంకటరెడ్డి, ఆర్ఐలు ఆసీప్, రామారావు, పంచాయతీ కార్యదర్శి ఉమేష్‌పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలు అందాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికి అందించాలని మండల ప్రత్యేకాధికారి జూలకంటి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో మాతంగి రమేష్, మండల వైద్యాధికారి మోయిన్, సీడీపీవో రేఖల మమత, ఎంఈవో ధర్మానాయక్ ఉన్నారు.





## ప్రభుత్వ విప్‌ను విమర్శించడం తగదు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పై బిఆర్ఎస్ పార్టీ నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి విమర్శలు చేయడ మానుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయ న మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓరువలేక ఆయనపై విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి ముద్దసాని సిద్ధులు గౌడ్, మాజీ జెడ్పిటిసి నరేందర్ గుప్తా, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జే.నగేష్, ఓబిసి మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, మండల నాయకులు తుమ్మల నర్సిరెడ్డి, కందడి అనంతరెడ్డి, నోముల వెంకన్న పాల్గొన్నారు.

## ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్లకు సన్మానం



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఉపాధి హామీ పనిలో అత్యధిక ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు పరుస్తూ, అత్యధిక కూలీలతో పని చేసిన 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌ను గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర రావు శాలువాతో సన్మానించి రూ.1000 ప్రైజ్ మనీ అందజేసి అభినందించారు. తుర్కపల్లి మండలానికి చెందిన ఇబ్రహీంపూర్ ఫీల్ అసిస్టెంట్ గడిపె ఇంద్రయ్య, తిరుమలపురం ఫీల్ అసిస్టెంట్ హుస్సేన్, ములకలపల్లి ఫీల్ అసిస్టెంట్ సుజాతలు మండలానికి చెందిన ముగ్గురు ఫీల్ అసిస్టెంట్లు ఉండడం పట్ల మండల అధికారులు, మండల ప్రజలు వర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ నాగిరెడ్డి, అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ మందడి ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## 'హలో ఉద్యమకారుడా... చలో తార్నాక'

**ప్రజాపక్షం/రామన్నపేట** : జోగు అంజన్న పిలుపు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యమకారుల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించుటకు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తార్నాక లోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉద్యమకారుల విస్తృతస్థాయి సమావేశం శనివారం జరగనున్న కార్యక్రమానికి రాష్ట్రంలోనే 33 జిల్లాల నుంచి ఉద్యమకారులు భారీ ఎత్తున తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఈ సమావేశానికి 18వ తేదీన ఉదయం తొమ్మిదిన్నర గంటలకు తార్నాక చౌరస్తా నుండి ర్యాలీగా మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు వెళ్లి 10 గంటల నుండి ఈ సమావేశాన్ని ప్రారంభించి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందని ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

## మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీజీఈజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీజీఈజేఏసీ సెక్రటరీ సుంకరి బిక్షం గౌడ్,ఎగ్జిక్యూటివ్ మెంబర్ మారం అంజిరెడ్డి,టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలోని ఉద్యోగులు,ఉపాధ్యాయులు,కార్మికులు,పెన్షనర్ల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.ఈనేపథ్యంలో ఏప్రిల్ 17న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన నిర్వహించి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈసమస్యలు పరిష్కారం కాకపోతే మే 5 తర్వాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జె. శేఖర్ రెడ్డి, యాకుబ్ నాయక్, కాలం నారాయణరెడ్డి, నర్రా శేఖర్ రెడ్డి, నిమ్మనగోటి జనార్ధన్, మేకల జాన్ రెడ్డి, యడ్ల సైదులు,తరాల పరమేష్, ఎస్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూములు కాపాడాలని ఎమ్మార్వోకు ఫిర్యాదు

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ఇబ్రాహింపురం గ్రామంలోని 155 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని గ్రామ సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతి రెడ్డి, గ్రామస్థులతో కలిసి బుధవారం తుర్కపల్లి ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. భవిష్యత్‌లో గ్రామ వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాకలాపాలకు, ప్రభుత్వ అవసరాల మేరకు ప్రభుత్వ భూములు వాడే పరిస్థితి ఉంటుందని,అలా కాకుండా ఎవరికి వారే ప్రభుత్వ భూములు కబ్జాలు చేసి, అన్యాక్రాంతం చేయడం సరికాదని అన్నారు.రెవెన్యూ అధికారులు అట్టి భూముల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి విచారణ చేసి భూములు కాపాడాలని, గ్రామ ప్రజల శ్రేయస్సుకోసం, గ్రామాభివృద్ధి కొరకు తమ బాధ్యతను నిర్వర్తిస్తామని సర్పంచ్ తెలిపారు.

## ప్రగతి ప్రణాళికలో మండల సభ



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రజలకు మేలు జరిగేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా, వారి సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండల సభలో జాయింట్ కలెక్టర్ సీతరామారావు మాట్లాడుతూ ప్రధాన సంక్షేమ పథకాలపై సమగ్ర సమాచారం అందించారు. లబ్ధిదారుల తమ అనుభవాలను, అభిప్రాయాలను వెల్లడించారు. ఈ పథకాలు ప్రజలకు వర్తిస్తే ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోతహసిల్దార్, ఎంపిడివో, పోలీస్ అధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్‌ల ఏర్పాటు

**ప్రజాపక్షం/రామన్నపేట :** గత కొన్ని సంవత్సరాలనుండి సమస్యగా మారిన పశువుల దవాఖాన ముందు ఉన్న ప్రమాదకర డ్రైనేజీ, మవడ్ల మార్కెట్ వద్దకు వెళ్లే రైతులకు వాహనాలకు ఇబ్బందిగా ఉండడంతో పాటు అనేక ప్రమాదాలు జరగుతున్న పరిస్థితిలను గుర్తించిన ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ శాశ్వత పరిష్కారం కోసం సిమెంట్ పైపులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేసే పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వరికుప్పల స్వామి, పుట్టల లక్ష్మమ్మ ముత్యాలు, వడ్లకొండ లక్ష్మి మల్లేశం, కంబాలపల్లి సత్తయ్య, నల్ల ఎల్లేష్, చిన్నలచ్చి శంకరమ్మ, రేపాక పారిజాత, కప్పల మంగమ్మ రాజు పాల్గొన్నారు.



# ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి






**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్** : రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని టూ టౌన్ సిఐ రాఘవరావు సూచించారు. గురువారం నల్లగొం డ పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక,99 రోజుల రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని గురువారం నాలుగో రోజు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించారు.ఈసందర్భంగా టూ టౌన్ సిఐ రాఘవరావు,ఎస్ఐ సైదులు బస్టాండ్ ప్రాంతంలో సుమారు 70 మంది ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.



**ప్రజాపక్షం/అనంతగిరి:** ప్రజల సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ఎస్ఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ లోతల్లి దండ్రులు అజాగ్రత్తగా ఉండటం వల్ల చాల మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు.




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పట్టణ సిఐ వెంకట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అతి వేగం, అజాగ్రత్త వల్ల ప్రాణాలు కోల్పోవడమే కాకుండా కుటుంబాలు వీదిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ విక్రమ్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, రవాణాశాఖ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమీక్ష సమావేశం స్థానిక ఎంపీడీవో ప్రమోద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్పెషల్ ఆఫీసర్ జయశ్రీ, జెడ్పీ సీఈవో సంధ్యారాణి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పల్నాటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ నరసింహారావు, ఏపీవో ప్రశాంతి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రహదారి నిబంధనలు పాటించడం హెల్మెట్ ధరించడం వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ బి. శ్రీకాంత్, నాగారం సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ, ఇంచార్జి మండల ఎంపిఓ సందీప్, ఈ. సైదులు, ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై సమన్వయంతో పనిచేయాలని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రగతి కార్యాచరణ పై ఏర్పాటు చేసిన ప్రత్యేక జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేలా కృషి చేయాలని, రోడ్డు భద్రత పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, తహసిల్దార్ లావణ్య, ఎంపీఓ శ్రావణ్ కుమార్, ఎస్‌హెచ్‌ఓ లక్ష్మీ నారాయణ, ఎంఈఓ మహదేవరెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి;** వాహనదారులు తప్పనిసరిగా వాహనాలను నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని డిండి ఎస్ఐ బాలకృష్ణ వాహనదారులకు సూచించారు బుధవారం రాత్రి మండలంలోని శాంతిగూడెం గ్రామంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డితో కలిసి ప్రజలకు రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. 100 మంది వాహనదారులకు హెల్మెట్‌లను సర్పంచ్ భాస్కర్‌రెడ్డితో కలిసి వాహనదారులకు పంపిణి చేశారు.



# సిబ్బంది సంక్షేమమే లక్ష్యం



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఎస్‌పీఎఫ్)నాగార్జునసాగర్ యూనిట్ ఆధ్వర్యంలో సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక అవగాహన శిబిరం నిర్వహించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డైరెక్టర్ జనరల్ ఆదేశాలు, జోన్ డీఐజీ మార్గదర్శకత్వంలో టీజీ జెన్‌కో పవర్ హౌస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చీఫ్ మేనేజర్ టి. వెంకట గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ జి. నాగమల్లేశం ముఖ్య అతిథులుగా హాజరై సహకరించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్ డ్యామ్,టీజీ జెన్‌కోకు చెందిన సుమారు 45 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ కమాండెంట్ డి. విజయ భాస్కర్ రావు పర్యవేక్షించారు. సిబ్బంది సంక్షేమం కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.



## ధర్నా విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** వామపక్షాల పార్టీల పోరాట ఫలితంగా వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ఈనెల 20 నుండి చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నరసింహ అన్నారు. గురువారం మండలంలోని మగ్గంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి కూలీల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి కూలీల పొట్టలు కొడదామని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందన ఉపాధి హామీలో అనేక జీవో తెచ్చి పథకాన్ని రద్దు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ గాడి శ్రీనివాస్, సిఐటియు మండల కన్వీనర్ బండారి శ్రావణ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ, ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలు



**ప్రజాపక్షం/రామన్నపేట:** అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 14 నుంచి 20 వరకు జరుగుతున్నాయి.అందులో భాగంగా అగ్నిమాపక నివారణ పద్ధతులు ఎలా పాటించాలో ప్రజలకు తెలియజేయడానికి రామన్నపేట గ్రామంలో ఉన్న మైనార్టీ కాలనీలో అగ్ని ప్రమాద నివారణ పద్ధతులైన ఎల్పిజి గ్యాస్ ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ,మిగిలిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సు చేయడం జరిగింది.అగ్నిమాపక అధికారి ఎస్ ఎఫ్ ఓ బి.మధుసూదన్ రెడ్డి,లీడింగ్ ఫైర్ ఫైటర్ డి.రామ నరసయ్య, అగ్నిమాపక సిబ్బంది షఫీ, పాండు, గోపాల్, మధు మరియు కాలనీ ప్రజలు జావేద్,ఖాసిం, షాహిద్ పాల్గొన్నారు.

## రసాభాసగా మండలస్థాయి సమావేశం



**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశంలో అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొనగా అట్టి సమావేశంలో టిఆర్ఎస్ సర్పంచులు ప్రభుత్వ కార్యక్రమాలకు మాకు సరైన సమాచారం గౌరవం దక్కడం లేదని అధికారులను నిలదీస్తున్న తరుణంలో కాంగ్రెస్ సర్పంచులు టిఆర్ఎస్ సర్పంచుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది, అధికారులు పోలీసులు జోక్యం చేసుకొని ఇరువురుగాలకు నచ్చ చెప్పారు.

## సాదాసీదాగా మండల స్థాయి సమావేశం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక నందు గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం ఎంపిడివో చండీరాణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొనగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు వారి గ్రామాలలో అభివృద్ధి పనులకు సంబంధించి నిధులను కేటాయించాలని అధికారులకు సూచించగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. మోత్కూర్ మార్కెట్ కమిటి చైర్మన్ విమల వెంకటేశ్వర్లు, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, డిఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.